నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, సోమవారం 22 జూలై 2024 | MEDAK

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో రైతులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో వర్షంలో కవర్లు, గొడుగులతో వెళ్తున్న చిన్నారులు

మూడు డంపులు..ఆరు ట్రాక్టర్లు

- ట్రెండ్‌గా మార్చిన రవాణాదారులు
- సీజ్ చేసిన ఇసుక మాటున అక్రమ వ్యాపారం
- డంపులు చేసేది వారే.... సమాచారం ఇచ్చేవారు వారే...
- వేలం పాటల్లో తక్కువ రేటుకు హక్కులు
- దర్జాగా రవాణా చేస్తూ కాసులు సంపాదిస్తున్న వైనం
- మామూళ్ల మాటున రెవెన్యూశాఖ అధికారులు..?
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాగం

సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం జాలపల్లిలో ఇసుక డంపులు

చేర్యాల/మద్దూరు(ధూళిమిట్ట), జూలై 21: ఇసుకను వాగుల నుంచి రాత్రి, వేకువజామున లేదా సెలవు రోజుల్లో పలువురు అక్రమంగా రవాణా చేసి కాసులు సంపాదించుకునేవారు. కానీ, సిద్దిపేట జిల్లా చేర్యాల, ధూళిమిట్ట ప్రాంతాలకు చెందిన ఇసుకాసురులు తమ స్టైల్‌ను మార్చి మరో ట్రెండ్‌ను సెట్ చేసి అక్రమ ఇసుకను సక్రమంగా రవాణా చేస్తూ 'మూడు డంపుల్లో ఇసుకను ఆరు ట్రాక్టర్ల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూ రు, ధూళిమిట్ట మండలాల్లోని వాగుల నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో ఇసుకను అక్రమంగా రవాణా చేసి కాసులు కూడబెట్టుకోవాలనుకునే ఇసుకాసురులు ఇప్పుడు కొత్తరకంగా ఆలోచన చేసి దానిని పక్కాగా అమలు చేస్తున్నారు. చేర్యాల మండలంలోని కక్కాయపల్లి, ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి మొదటగా స్థానిక అవసరాలంటూ ఇసుకను తరలిస్తున్నారు. రవాణా చేసుకునేందుకు అనువుగా ఉండే ప్రైవేట్ వ్యక్తులు, మామిడి తోటల్లో డంపులు చేస్తున్నారు. అనంతరం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల ద్వారా రెవె న్యూ, పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులకు డం పులు ఉన్న చోటును ఫోన్‌లో సమాచారం అందిస్తున్నారు. సంబంధితశాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్లి డంపును పట్టుకున్నట్లు ఫొటోలు దిగి దానిని సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు.

ఇక్కడి నుంచే అసలు కథ షురూ...

ఇసుక రవాణాదారులు వేసిన పథకం ప్రకారం అధికారులు రావడం, డంపులు పట్టుకోవడం జరిగిపోయిన అనంతరం రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం వేస్తున్నట్లు మొదటగా ప్రకటనలు ఇస్తున్నారు. అనంతరం వేలం పాటలు నిర్వహించే రోజు ఎవరైతే డం పులు చేయించారో వారి బినామీల ద్వారా 50 నుంచి 100 ట్రాక్టర్లు లభించే ఇసుకనకు నామమాత్రంగా రూ.50వేల నుంచి లక్షన్నర వరకు పాట పాడించి హక్కులు దక్కించుకుంటున్నారు. ఇదే ఇసుక బహిరంగ మార్కెట్‌లో 50 ట్రిప్పులు అయితే రూ.2లక్షలు, 100 టిప్పులు అయితే 4లక్షలకు పైగా ఉంటుంది. అధికారుల వేలం పాట పూర్తికాగానే ఇసుక డంపును స్థానిక, ఇతరత్రా అవసరాలకు విక్రయించుకోవచ్చని ఒక అనుమతి పత్రం హక్కులు దక్కించుకున్న వ్యక్తి అందిస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుని ఇసుకాసురులు సిద్దిపేట, దుద్దెడ, నంగునూరు, చేర్యాల, మద్దూరు మండలాల్లోని వివిధ గ్రామాలకు ఇసుకను రవాణా చేస్తున్నారు. అధికారులు ఇచ్చిన అనుమతి పత్రం లో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు తీసుకుపోయే ట్రాక్టర్ల నంబర్లు పొందుపరుస్తున్నారు.కానీ రవాణాదారులు మాత్రం అనుమతి ఇచ్చిన నం బర్ల ట్రాక్టర్లు, ట్రక్కులే కాకుండా మరికొన్ని ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో ఇప్పటికీ మూడుసార్లు, చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో రెండు సార్లు అధికారులు డంపులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాన్ని పట్టుకుని ఇక ట్రాక్టర్ల ద్వారా రవాణాదారులు ధూళిమిట్ట మండలంలోని కమలాయపల్లి నుంచి చేర్యాల మండలంలోని మాసిరెడ్డిపల్లి, ఆకునూరు, రాంపూర్ మీదుగా మద్దూరు మండలంలోని నర్సాయపల్లికి ఇసుక తీసుకుపోతున్నారు.అనుమతి పొందిన రోజు నుంచి డం పు పేరిట వాగుల నుంచి మరింత ఇసుకను తీసి విక్రయిస్తున్నారు. రవాణా విషయంలో ఎవరైనా ప్రశ్నిస్తే అనుమతి ఉందని సదరు పత్రం చూపిస్తున్నారు.

అధికారుల ప్రోత్సహపై అనుమానాలు ?

వాగుల నుంచి తీసిన ఇసుకను ప్రైవేట్ వ్యక్తుల ప్రదేశాల్లో డంపు చేసినప్పుడు ఏవ్యక్తి అయినా తమ స్థలంలో ఎందుకు డంపు చేస్తున్నారని, ఎవరు పోస్తున్నారే విషయాన్ని తెలుసుకుంటారు. డంపులు దొరికిన స్థలానికి చెందిన వ్యక్తిని ఎవరు డంపులు చేశారనే విషయాన్ని అధికారులు ప్రశ్నించకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆఫీసర్ల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరి స్థలంలో అయితే ఇసుక డంపు అవుతుందో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటే మరోచోట ఇసుక డంపు చేసేందుకు ఇసుకాసురులు వెనుకడుగు వేస్తారనే విషయాన్ని అధికారులు ఎందుకు విస్మరిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బందిపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వారు అనుకుంటే ఆపుతారని పేర్కొంటున్నారు.

ముసురువాన

- ఉమ్మడి మెదక్ జిల్లా అంతటా వర్షం
- సంగారెడ్డి జిల్లా కంగ్టిలో అత్యధికంగా 4.8 సెం.మీటర్ల వర్షపాతం నమోదు
- సింగూరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం కడ్పల్ పాఠశాల ఆవరణలో నిలిసిన వర్షపు నీరు

సంగారెడ్డి జూలై 21 (నమస్తే తెలంగాణ): తుఫాన్ ప్రభావం వల్ల సంగారెడ్డి జిల్లాలో వర్షాలు పడుతున్నాయి.చాలా ప్రాంతాల్లో రోజంతా ముసురు కురిసింది. వర్షాల వల్ల వాన కాలంలో సాగు చేసిన పంటలకు ఊపిరి ఊదినట్లు అవుతున్నది. వర్షాలు లేక నారాయణఖేడ్ ప్రాంతంలో పంటలు ఎండిపోతుండగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు ప్రాణం పోసినట్లు అయ్యింది. జిల్లాలో అత్యధికంగా వర్షపాతం కంగ్టిలో 4.8 సెంటీ మీటర్లు కురిసింది. అత్యల్పంగా అందోల్ మండలంలో 1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా 2.1 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం కురిసింది. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షం పడగా 14 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. నాలుగు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. సిర్గాపూర్ మండలంలో 4.6 సెంటీమీటర్లు, కల్హేర్‌లో 3.5 సెంటీమీటర్లు, నిజాంపేట, గుమ్మడిదల మండలాల్లో 3.3 సెంటీమీటర్లు, నాగల్‌గిద్దలో 2.7 సెంటీమీటర్లు, నారాయణఖేడ్, మనూరులో 2.4 సెంటీమీటర్లు. ఆర్‌సీపురంలో 2.3, అమీన్‌పూర్‌లో 2.2 సెంటీమీటర్లు, చౌటకూరులో 2.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని మిగతా మండలాల్లో 1.5 నుంచి 2 సెంటీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది. ఈనెలలో ఇప్పటి వరకు 12.3 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 12.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. వర్షాలతో పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద వస్తున్నది. ఆదివారం ప్రాజెక్టులోకి 620 క్యూసెక్కుల జలాలు వచ్చాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీ కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 13.560 టీఎంసీల జలాలు ఉన్నాయి.

సిద్దిపేట జిల్లాలో....

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 21: సిద్దిపేట జిల్లాలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్నది. దుబ్బాకలో 19.4 మి.మీటర్లు, సిద్దిపేట రూరల్‌లో 16.8మి.మీ, చిన్నకోడూరులో15.6మి.మీ, బెజ్జంకిలో18.4మి.మీ, కోహెడలో 43 మి.మీ, హుస్నాబాద్‌లో 30.2మి.మీ, అక్కన్నపేటలో 34.4 మి.మీ, నంగునూరులో 24.6మి.మీ, సిద్దిపేట అర్బన్‌లో 16మి.మీ, తొగుటలో 24.4మి.మీ, మిరుదొడ్డిలో 14.2 మి.మీ, దౌల్తాబాద్‌లో 22మి.మీ, రాయపోల్‌లో16.2మి.మీ, వర్గల్‌లో 11.6 మి.మీ, ములుగులో 17.6మి.మీ, మర్కూక్‌లో 16.8మి.మీ, జగదేవ్‌పూర్‌లో18.4మి.మీ, గజ్వేల్‌లో 12.4మి.మీ, కొండపాకలో 25మి.మీ, కొమురవెల్లిలో 22.2 మి.మీ, చేర్యాలలో 26.4మి.మీ, మద్దూరులో 44మి.మీ, నారాయణరావుపేటలో 14.2మి.మీ, ధూళిమిట్టలో 31.2 మి.మీ, అక్బర్‌పేట- భూంపల్లిలో19.8మి.మీ, కుకునూర్‌పల్లిలో 27మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మద్దూరు మండలంలో 44 మి.మీటర్లు, అత్యల్పంగా వర్గల్ మండలంలో 11.6మి.మీటర్ల వర్షం కురిసింది.

మెదక్ జిల్లాలో...

మెదక్, జూలై 21 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా వ్యాప్తంగా ముసురు వాన పడింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ముసురు వాన కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 7.7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నిజాంపేట మండలంలో 9.2 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా మాసాయిపేట మండలంలో 4.1 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. నర్సాపూర్‌లో 9.1 మి.మీ, చిన్నశంకరంపేటలో 8.9 మి.మీ, నార్సింగిలో 8.3 మి.మీ, రామాయంపేటలో 8.8 మి. మీ, టేక్మాల్‌లో 8.9 మి.మీ, అల్లాదుర్గంలో 8.4 మి.మీ, పెద్దశంకరంపేటలో 8.3 మి.మీ, హవేళీఘనపూర్‌లో 8.4 మి.మీ, తూప్రాన్‌లో 8.5 మి.మీ వర్షం కురిసిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

సిద్దిపేటలో వర్షంలోనే గొడుగులతో వెళ్తున్న ప్రజలు

సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 21: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏ సమయంలో అయినా ఎలాంటి ప్రమాదం తలెత్తినా క్షణాల్లో అక్కడికి చేరుకునే విధంగా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. నిరంతరం పోలీస్ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటుందని సూచించారు. ఎవరైనా అపదలో ఉంటే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ సెల్: 8712657888 నెంబర్ లేదా స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. పొలాల్లో విద్యుత్ మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలు, వైర్లను చేతులతో తాకవద్దన్నారు. మంజీరా పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు మత్తడి దుంకే అవకాశం ఉన్నందున వాటి వద్దకు వెళ్లవద్దన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వైద్యశాఖాధికారులతో సమన్వయం చేసుకుంటామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో రెండు ముక్కలుగా విరిగి నామమాత్రంగా భూమిపై ఆగి ఉన్న విద్యుత్ స్తంభం

పట్టించుకోని విద్యుత్ అధికారులు

పాపన్నపేట, జూలై 21: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల పుణ్యక్షేత్రానికి వెళ్లే దారిలో 11కేవీ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. నాగసాన్‌పల్లి నుంచి ఏడుపాయలకు వెళ్లిదారిలో ఈ ప్రమాదం పొంచి ఉంది. ఏడుపాయల ప్రఖ్యాతి చెందిన దేవాలయం కావడం వల్ల నిత్యం వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు, ప్రయాణికులు బస్సులు, వివిధ వాహనాలపై వస్తుంటారు. ఈ విషయమై సంబంధిత విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఏడుపాయలకు వెళ్లే భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల లొల్లి

చేర్యాలలో చింపివేసిన మొగుళ్ల రాజన్న యువసేన ఫ్లెక్సీ

చేర్యాల, జూలై 21: కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల లొల్లి మొదలైంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని వీరన్నపేటకు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి పుట్టిన రోజును ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాజన్న యువసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. పుట్టిన రోజు సందర్భంగా రాజన్న యువసేన పేరిట అభిమానులు చేర్యాల పట్టణంతోపాటు కొమురవెల్లి, జనగామలో భారీగా ఫ్లెక్సీలను శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. పీఎం గార్డెన్స్, చుంచనకోట క్రాస్‌రోడ్డు, బీడీ కాలనీ, భద్రభాళీ గార్డెన్స్ తదితర ప్రదేశాల్లో మొగుళ్ల రాజన్న యువసేన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంతోపాటు కొన్నింటిని తొలిగించారు. పంట రుణ మాఫీ సందర్భంగా డీసీసీ జనగామ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలతో కాంగ్రెస్ పట్టణ నాయకుడు అంబాల రాముగౌడ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కొమ్మూరి ఫొటో కనిపిస్తున్న ప్రదేశంలో ఉన్న ఫ్లెక్సీలను సైతం గుర్తుతెలియని వ్యక్తులు తొలిగించారు. గతంలో చేర్యాల, కొమురవెల్లి రహదారిలో మల్లన్న దర్శనం కోసం వస్తున్న భక్తులకు స్వాగతం పేరిట మొగుళ్ల రాజన్న యువసేన ఏర్పాటు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలిగించారు. తాజాగా మరోసారి మొగుళ్ల ఫ్లెక్సీలను తొలిగించడంపై స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఫ్లెక్సీల తొలిగింపు విషయం పోలీసులు దృష్టికి రావడంతో సీసీ కెమెరాలు తనిఖీ చేసి అసలు ఎవరు తొలిగించారో తెలుసుకునే పనిలోపడ్డారు. దోషులను తేలుస్తామంటున్నారు.

చేర్యాలలో కొమ్మూరి అభిమాని ఫ్లెక్సీ చింపివేత

నిధులు మంజూరైనా జరగని నిర్మాణం

- కోహీర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం మరిచిన అధికారులు
- నిత్యం ప్రమాదాల బారిన వాహనదారులు

కోహీర్‌లోని డీసీసీబీ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి దుస్థితి

కోహీర్, జూలై 21 : సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలోని ప్రధాన రహదారి దెబ్బతిన్నడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోహీర్ పట్టణంలోని డీసీసీబీ బ్యాంకు ఎదురుగా ఉన్న బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో అక్కడ సీసీ రోడ్డును నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో మురుగు నీటి కాల్వల నిర్మాణానికి రూ.15లక్షలు, సీసీ రోడ్డుకు రూ.8లక్షలను కేటాయించింది. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంజూరైన నిధులతో రోడ్డుకు ఇరువైపులా కాల్వలను నిర్మించారు. కానీ, సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సీసీ రోడ్డు నిర్మాణం మాత్రం మిగిలిపోయింది. కాల్వలు నిర్మించి ఏడాది కావస్తున్నా సీసీ రోడ్డు నిర్మాణ సంగతిని మాత్రం మరిచిపోయారు. దీంతో కోహీర్-బిలాల్‌పూర్ ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతల్లో వర్షపు నీరు నిలబడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే అనేక మంది అందులో పడి గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి సీసీ రోడ్డును నిర్మించాలని, కనీసం జిల్లా అధికారులైనా స్పందించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎంతోమంది గాయపడ్డారు..

కోహీర్‌లో డీసీసీబీ బ్యాంకు ఎదురుగా సీసీ రోడ్డు, మురుగు కాల్వ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.23 లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి కాల్వలను కూడా నిర్మించారు. కానీ, సీసీ రోడ్డును మాత్రం నిర్మించకుండా వదిలేశారు. ఇప్పటికీ ఈ రోడ్డుపై ఉన్న గుంతల్లో పడి ఎంతోమందికి దెబ్బలు తగిలాయి. అయినా ఇక్కడి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులైనా స్పందించి, రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గణేశ్‌రెడ్డి, వాహనదారుడు, కోహీర్

గుంతలు తేలిన శివనగర్-కంజర్ల రోడ్డు

- వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం
- మళ్లీ బస్సు బంద్ అవుతుందేమోనని ప్రజల ఆందోళన

జిన్నారం: శివనగర్ సమీపంలో గుంతలు తేలిన రోడ్డు

జిన్నారం, జూలై 21: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివనగర్ నుంచి కంజర్ల వెళ్లే రోడ్డు గుంతలు తేలి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో మెటల్ వేసి వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవలే నర్సాపూర్ నుంచి జిన్నారం, శివనగర్ మీదుగా పటాన్‌చెరుకు బస్సు సౌకర్యం ప్రారంభమైంది. పెద్ద పెద్ద గుంతలతో ఈ రోడ్డుపై బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు మీద ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. నెలక్రితం ఈ రోడ్డుపై గుంతలు ఎక్కువ కావడంతో బస్సు బంద్ అయ్యింది. సమస్యను తెలుసుకున్న మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ మట్టి పోయించి గుంతలు పూడ్చి బస్సు మళ్లీ తిరిగేలా రోడ్డు బాగు చేయించారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై మొత్తం పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పటాన్‌చెరు రింగ్ రోడ్డు సమీపం నుంచి కంజర్ల పరిధి వరకు నాలుగులైన్ల రోడ్డు మంజూరైనా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. రోడ్డు ఇలాగే ఉంటే బస్సు మళ్లీ బంద్ అయ్యే అవకాశం ఉందని, ఇది జరగకముందే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి బాగు చేయించాలని శివనగర్ గ్రామస్తుల కోరుతున్నారు. మరోవైపు చిన్నపాటి వర్షానికి గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని రోడ్లు అధ్వానంగా మారాయి. ఖాజీపల్లి సమీపంలోని రింగ్‌రోడ్డు కింద చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలిచి బ్రిడ్జి కింద నుంచి వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిన్నారం: ఖాజీపల్లి శివారులోని రింగ్‌రోడ్డు కింద నిలిచిన నీళ్లు

వైద్య కళాశాలలో
వసతులు పూర్తి చేయాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్
- నూతన ప్రభుత్వ వైద్య కళాశాల పరిశీలన

మెదక్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 21(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలోని పిల్లకొట్టాల్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలను పరిశీలించి ఆయన మెడికల్ సూపరింటెండెంట్‌కు తగు ఆదేశాలు జారీ చేశారు. వైద్య కళాశాలకు డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవడం కోసం నోటిఫికేషన్ విడుదల చేసి తద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య కళాశాల బిల్డింగ్ యాజమాన్యం వైద్య కళాశాలలో వసతులు పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ సెక్రటరీ సమావేశంలో మెడికల్ కళాశాల ఏర్పాటుపై చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకోవడం జరిగిందని, మెడికల్ కళాశాలకు అనుమతులు వచ్చేవరకు అన్ని సౌకర్యాలు కల్పించి డాక్టర్లు, సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ప్రతిష్టాత్మక ప్రణాళిక తయారు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, దవాఖాన సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానల్లోనే ప్రసవాలు జరగాలి

ప్రభుత్వ దవాఖానల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులతో కలిసి మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో బాలింతలతో మాట్లాడి దవాఖానల్లో ప్రసవాల తీరును తెలుసుకున్నారు. ప్రైవేట్ దవాఖానలో పేదలు ప్రసవాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయలేరని ప్రభుత్వ దవాఖానల్లోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్లకు వసతి సౌకర్యం సరిపోవడం లేదని గుర్తించి అదనపు వసతి ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మిషన్ భగీరథ ట్యాంకు

భయాందోళనలో మల్లుపల్లి గ్రామస్తులు

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లిలో శిథిలావస్థకు చేరిన మిషన్‌భగీరథ ట్యాంకు

మిరుదొడ్డి, జూలై 21: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లికి తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే ట్యాంకు కింది భాగం పెచ్చులు ఊడిపోయి ప్రమాద స్థాయికి చేరుకుంది. నీటితో నిండిన సమయంలో శిథిలావస్థలో ఉన్న ట్యాంకు కూలి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి శిథిలావస్థలో ఉన్న ట్యాంకును తొలిగించి నూతన ట్యాంకు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.